

నత్తనడకన బదిలీలు..

సెర్ప్ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. బదిలీల జీవో వచ్చి రెండు నెలలు దాటినా ప్రక్రియ పూర్తి కాలేదు.

- 8లో ▸



భూ సేకరణ, చెల్లింపులు..

రోడ్ల విస్తరణ, అభివృద్ధి పనుల భూ సేకరణ ప్రక్రియ, చెల్లింపులు జరిగేలా చూడాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
33.1 /21.6

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అడపాదడపా వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ఎస్సారెస్పీకి పెరిగిన వరద



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల వరద నీరు పెరిగింది. ప్రాజెక్టులోకి 3032 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 100 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 286 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా, మంగళవారం సాయంత్రానికి ప్రాజెక్టులో 1065.00(16 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుత సీజన్‌లో ప్రాజెక్టులోకి గత నెలలో 4.74 టీఎంసీల వరద వచ్చినట్లు రికార్డులు తెలుపుతున్నాయి.

బాబ్లీ గేట్లు ఎత్తడంతో..

రెంజల్(బోధన్): బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో గోదావరిలోకి స్వల్పంగా వరద నీరు వచ్చి చేరింది. బాబ్లీ ప్రాజెక్టులో నీరు తక్కువ శాతం ఉండటంతో వరద నీరు సాయంత్రానికి వచ్చి తగ్గుముఖం పట్టింది. నదిలోని పురాతన శివాలయం చుట్టూ నీరు వచ్చి చేరింది. గోదావరికి వరద ప్రవాహం రావడంతో పలు గ్రామాల నుంచి సందర్శకులు తిలకించేందుకు వచ్చారు. తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎస్సై చంద్రమోహన్, ఇన్‌చార్జి ఎంపీడీవో రఫీయొద్దీన్ నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. పశువుల కాపరులు, మత్స్యకారులు వరదలు పూర్తయ్యే వరకు గోదావరి నది పరీవాహక ప్రదేశాలకు వెళ్లవద్దని ఆయా గ్రామాల కార్యదర్శులతో గ్రామాల్లో దండోరా వేయించారు.

13న ఊర పండుగ

నిజామాబాద్‌రూరల్: ఇందూరు సంస్కృతీ తీసంప్రదాయాలు ప్రతిబింబించే ఊర పండుగను ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్నట్లు సర్వసమాజ్ ఉత్సవ కమిటీ కన్వీనర్ రాంబత్రి గంగాధర్, కార్యదర్శి బంటు రాజేశ్వర్ తెలిపారు. ఊర పండుగ, బండారు నిర్వహణపై నగరంలోని సర్వసమాజ్ కార్యాలయంలో మంగళవారం సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా బంటు రాజేశ్వర్ మాట్లాడుతూ.. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగాపండాలని, చిన్నాపెద్ద ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని గ్రామ దేవతలను కొలుస్తూ ఊరపండుగ నిర్వహిస్తామన్నారు. 8వ తేదీన ఎల్లమ్మగుట్ట, బొబ్బిలి వీధిలలో బండారు పోస్తామని తెలిపారు.

క్యాంపస్‌లో విద్యార్థుల ఆందోళన



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ న్యూ బాయ్స్ హాస్టల్‌లో సోమవారం రాత్రి భోజనంలో పురుగు రావడంతో విద్యార్థులు మంగళవారం ఆందోళనకు దిగారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ హోరెత్తించారు. చీఫ్ వార్డెన్ మామిడాల ప్రవీణ్ కుమార్, వార్డెన్ సంపత్ అక్కడికి చేరుకుని సముదాయించినప్పటికీ వీసీ రావాల్సిందేనని విద్యార్థులు డిమాండ్ చేశారు. కొద్దిసేపటికీ రిజిస్ట్రార్ యాదగిరి అక్కడికి చేరుకున్నారు. వీసీ అందుబాటులో లేరని సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని విద్యార్థులకు హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు ధర్నా విరమించారు.

బల్దియాలో ట్రెయినీ కలెక్టర్

- వారం రోజులపాటు మున్సిపల్ సేవల పరిశీలన



నిజామాబాద్ సిటీ: ట్రెయినీ కలెక్టర్ కరోలియన్ చింక్తియాన్ మావీ మున్సిపల్ కార్పొరేషన్‌ను సందర్శించారు. మున్సిపల్ జరుగుతున్న పనులను అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ శాఖలోని విభాగాలు, ప్రజలకు అందిస్తున్న సేవల వివరాలను సేకరించారు. 2024 బ్యాచ్‌కు చెందిన శిక్షణా కలెక్టర్ కరోలియన్ చింక్తియాన్ మావీ శిక్షణలో భాగంగా జిల్లాకు ఇటీవల వచ్చారు. వారం రోజుల పాటు మున్సిపల్ కార్పొరేషన్‌లో జరుగుతున్న పనులను స్వయంగా పరిశీలించనున్నారు. ట్రెయినీ కలెక్టర్‌కు ప్రత్యేక చాంబర్‌ను కేటాయించారు. బుధవారం నుంచి ఆమె స్వయంగా బల్దియాకు వచ్చి ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించనున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పాలనలో శిక్షణ తీసుకోనున్నారు.

జిల్లా కేంద్రమైన నిజామాబాద్ నగరం నలుదిశలా వేగంగా విస్తరిస్తోంది. ఎంత వేగంగా విస్తరిస్తోందో.. అంతే వేగంగా సమస్యలు పెరుగుతున్నాయి. రాష్ట్రంలోని ప్రముఖ నగరాల్లో ఒకటిగా గుర్తింపు ఉన్న నిజామాబాద్ నగరంలో ఐదు దశాబ్దాల క్రితం(1972) నాటి మాస్టర్ ప్లాన్ అమలులో ఉంది. 2018లో నూతన మాస్టర్ ప్లాన్‌ను రూపొందించినప్పటికీ దాని ప్రస్తావన ఎక్కడా లేకుండాపోయింది. నగర జనాభా రోజురోజుకూ పెరుగుతుండగా అందుకు అనుగుణంగా సౌకర్యాలు మాత్రం కనిపించడం లేదు.

జిల్లా కేంద్రంలోని బస్టాండ్ మూలమలుపు వద్ద అస్తవ్యస్తంగా వాహనాల రాకపోకలు



దశాబ్దాలైనా మారని దశ

కార్పొరేషన్‌గా మారి 20 ఏళ్లు..

- నిజామాబాద్ నగరంలో అమలవుతున్న 1972 మాస్టర్ ప్లాన్
- ఫుట్‌పాత్‌లపై వ్యాపారం.. రోడ్లపై పార్కింగ్
- అనుమతులు ఓ రకంగా.. నిర్మాణాలు మరో రకంగా..
- రోజురోజుకూ తీవ్రమవుతోన్న ట్రాఫిక్ సమస్య
- ప్రభుత్వ స్థలాల్లో పార్కింగ్ చేస్తే సమస్యకు పరిష్కారం!
- కొత్త మాస్టర్‌ప్లాన్ అమలుకు నోచుకునేదెన్నడో..?

సుభాష్‌నగర్: నిజామాబాద్ నగరం మున్సిపల్ కార్పొరేషన్ హోదా దక్కించుకుని 20 ఏళ్లు గడుస్తున్నా నగరవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు మాత్రం అలానే ఉన్నాయి. కార్పొరేషన్ స్థాయిలో పన్ను వసూలు చేస్తున్నా సౌకర్యాలు మాత్రం అధ్వానంగా ఉన్నాయి. ముఖ్యంగా రోడ్లు, ఫుట్‌పాత్‌లు, ట్రాఫిక్ సమస్య ప్రజలను తీవ్రంగా వెంటాడుతోంది. పెద్దపెద్ద వ్యాపార సముదాయాలకు అనుమతులు ఒక రకంగా తీసుకుంటూ మరో రకంగా నిర్మాణాలు చేపట్టడమే ఇందుకు కారణమవుతోంది. కొన్ని చోట్ల ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేస్తుండగా, మరికొన్ని చోట్ల వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు.

నిజామాబాద్ నగరంలో సుమారు ఐదు లక్షల మంది నివసిస్తుండగా, వివిధ ప్రాంతాల నుంచి పనుల నిమిత్తం ప్రతిరోజూ వేల సంఖ్యలో వస్తూవెళ్తుంటారు. ప్రస్తుతం నిజామాబాద్‌లో 1972 మాస్టర్ ప్లాన్ అమలవుతోంది. చాలా ప్రాంతాల్లో రోడ్లు చిన్నగా ఉండగా, విస్తరణ కోసం ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం 20 ఏళ్లగా ఎలాంటి చొరవ తీసుకోకపోవడం, గడిచిన 15 ఏళ్లలో వాహనాల వినియోగం విపరీతంగా పెరగడంతో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది.

టౌన్ ప్లానింగ్ బాధ్యత మరిచిందా?

నగరంలో నిత్యం వందల సంఖ్యలో నూతన నిర్మాణాలు చేపడుతున్నారు. ముఖ్యంగా వ్యాపార సముదాయాలు ఉన్న ప్రాంతాల్లో భవనాల నిర్మాణాల విషయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అనుమతుల ఓ రకంగా.. నిర్మాణాలు మరో రకంగా ఉంటున్నాయంటూ ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయి. అయితే ఆ ఫిర్యాదులు అధికారులకు కాసులు కురిస్తున్నాయని, తూతూ మంత్రంగా తనిఖీలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సెల్లార్లు నిర్మిస్తున్నా.. వాటిని ఇతర అవసరాలకు వాడుతున్నారనేది బహిరంగ రహస్యం. ఇళ్ల నిర్మాణాలను క్షుణ్ణంగా పరిశీలించే అధికారులు.. వ్యాపార సముదాయాల విషయంలో మాత్రం ఎందుకంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది.



ఫుట్‌పాత్‌ను ఆక్రమించి వ్యాపారం.. రోడ్డుపై పార్కింగ్..



రాజీవ్‌గాంధీ ఆడిటోరియం రోడ్డులో ట్రాఫిక్

సాక్షి ఫోకస్ – కార్పొరేషన్ కహానీ-1

ఆ ప్రాంతాల్లో కనిపించని ఫుట్‌పాత్‌లు

ఖలీల్‌వాడి, పూసలగల్లి, కుమార్‌గల్లి, బస్టాండ్, రైల్వేస్టేషన్, గాంధీచౌక్, పెద్దబజార్, వీక్లీ మార్కెట్, గంజ్‌రోడ్, కంఠేశ్వర్, హైదరాబాద్ రోడ్, ఆర్మూర్ రోడ్, సుభాష్‌నగర్, ప్రగతినగర్, వినాయక్‌నగర్, ఆర్యనగర్ తదితర ప్రాంతాల్లో అస లు ఫుట్‌పాత్‌లు కనిపించడంలేదు. రోడ్లపై వాహనాల పార్కింగ్, వీధి వ్యాపారాల కారణంగా ట్రాఫిక్ సమస్య పెరుగుతోంది. ఫుట్‌పాత్‌లు లేకపోవడంతో పాదచారులు రోడ్లపైనే నడుస్తున్నారు.



తిలక్‌గార్డెన్ ప్రాంతంలో రోడ్డుపై పార్కింగ్

మాస్టర్ ప్లాన్ కోసం ఎదురుచూపులు

నగరంలో కొత్త మాస్టర్ ప్లాన్ అమలైతే అనేక సౌకర్యాలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయి. ముఖ్యంగా విశాలమైన రోడ్లు, పార్కులు అందుబాటులోకి వస్తాయి. మాస్టర్ ప్లాన్ అమలైతే ట్రాఫిక్ సమస్యకు కొంతవరకు పరిష్కారం లభిస్తుంది. వ్యాపార సముదాయాలున్న ప్రాంతాల్లోని ప్రభుత్వ స్థలాల్లో పార్కింగ్ (టెండర్) ఏర్పాటు చేస్తే ఫుట్‌పాత్‌లపై వాహనాల పార్కింగ్‌కు అవకాశం ఉండదు. అదేవిధంగా వ్యాపార సముదాయాల నిర్మాణం విషయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు నిక్కచ్చిగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వన్ వేలు చేయడం, వీధి వ్యాపారాలను కంట్రోల్‌లో ఉంచడం, అక్రమ పార్కింగ్‌లపై స్పెషల్ డ్రైవ్ చేపట్టడం వంటి వాటితో ట్రాఫిక్, ఫుట్‌పాత్ సమస్యను చెక్ పెట్టొచ్చని నగరవాసులు అంటున్నారు.

‘రూల్ ఫర్ ఆల్’ ఉత్తమాటేనా?

ట్రాఫిక్ నిబంధనలు అందరికీ ఒకేలా వర్తిస్తాయా? లేదా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు ఒక ప్రణాళిక లేకుండా ఇష్టారీతిన నిర్ణయాలు తీసుకుంటారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. వ్యాపార సముదాయాలున్న ప్రాంతాల్లో ఒక రూల్.. సాధారణ ప్రాంతాల్లో మరో రూల్ అమలు చేస్తున్నారని వాపోతున్నారు. పనుల నిమిత్తం జిల్లాకేంద్రానికి రావాలంటేనే ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంది. నగరంలో ట్రాఫిక్ వ్యవస్థ సమూలంగా మార్చేందుకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ఆక్రమణలను తొలగిస్తాం



నగరంలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగించాల్సిందే. పాదచారులకు ఇబ్బందులు కలిగించే విధంగా ఫుట్‌పాత్‌ల మీద వ్యాపారాలు చేయడం నేరం. దుకాణదారులు తమ వాహనాలను సెల్లార్‌లలో పార్క్ చేసుకోవాలి. త్వరలోనే ప్రత్యేక టీమ్‌తో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు తొలగిస్తాం. ట్రాఫిక్ ఉండే ప్రాంతాల్లో తోపుడుబండ్లవారిని అనుమతించం. వారికి కేటాయించిన స్థలాల్లోమాత్రమే వ్యాపారాలు చేసుకోవాలి. బల్దియా తరఫున పెయిడ్ పార్కింగ్ ఏర్పాటును కూడా పరిశీలిస్తున్నాం.

– దిలీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్

ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలి



నగరంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. కారులో బస్టాండ్, రైల్వేస్టేషన్, గాంధీచౌక్, ఖలీల్‌వాడి తదితర ప్రాంతాలకు వెళ్లలేకపోతున్నాం. ఇక హైదరాబాద్ రోడ్, ఆర్మూర్ రోడ్ ప్రాంతాల్లో వ్యాపార సముదాయాలకు సరైన పార్కింగ్‌లు లేక రోడ్లపైనే వాహనాలను పార్కింగ్ చేయాల్సి వస్తోంది. ట్రాఫిక్ పోలీసులు, కార్పొరేషన్ అధికారులు సమన్వయం చేసుకుని సమస్యకు పరిష్కారం చూపాలి. – ప్రశాంత్, గూపన్‌పల్లి

ఫుట్‌పాత్‌లపైనే పార్కింగ్ చేస్తున్నారు



నగరంలో అనేక ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపైనే వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. తద్వారా పాదచారులు రోడ్లపై నడవాల్సి వస్తోంది. పార్కింగ్‌కు స్థలాలు లేకపోవడం వల్లే సమస్య ఎదురవుతోంది. ట్రాఫిక్ పోలీసులు ఈ అక్రమ పార్కింగ్ విషయంలో కఠినంగా వ్యవహరించాలి. వ్యాపార సముదాయాల నిర్మాణ విషయంలోనూ కార్పొరేషన్ అధికారులు నిక్కచ్చిగా ఉండాలి. లేకుంటే ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం కష్టమే. – దేవేందర్, గాయత్రినగర్

అవసరం మేరకే ఎరువులు తీసుకోవాలి

- అందుబాటులో యూరియా సహా ఇతర ఎరువులు
- ఇందల్‌వాయిలో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి
- రేషన్ దుకాణం, ఎరువుల పంపిణీ కేంద్రం, పశువైద్యశాల సందర్శన
- భూభారతి దరఖాస్తులపై ఆరా



గోదాములో ఎరువుల నిల్వ వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

ఇందల్వాయి: యూరియాతో సహా అన్ని ఎరువుల నిల్వలు సరిపడా అందుబాటులో ఉన్నాయని, రైతులు ప్రస్తుత అవసరం మేరకే ఎరువులను కొనుగోలు చేసుకోవాలని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. ముందస్తుగా నిల్వ చేసుకోవద్దని సూచించారు. ఇందల్‌వాయి మండల కేంద్రంలో కలెక్టర్ మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తహసీల్ కార్యాలయంతోపాటు రేషన్ షాపు, ఎరువుల దుకాణం, గ్రామీణ పశు వైద్యశాలను సందర్శించి పని తీరును పరిశీలించారు. ముందుగా తహసీల్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా అందిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 3480 దరఖాస్తులు అందాయని తహసీల్దార్ వెంకట్‌రావు తెలుపగా.. దరఖాస్తుదారులకు రసీదులు అందించారా అని కలెక్టర్ ఆరా తీశారు. అనంతరం 12 నంబర్ రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు. లబ్ధిదారులకు మూడు నెలలకు సంబంధించి సన్నబియ్యం పంపిణీ పూర్తయ్యిందా అని డీలర్‌ను ప్రశ్నించగా, జూన్ నెలాఖరునాటికే పూర్తి చేశామని ఆయన సమాధానమిచ్చారు. అక్కడి నుంచి ఎరువుల పంపిణీ కేంద్రానికి చేరుకొని స్టాక్‌ను పరిశీలించారు. ఎరువుల కొనుగోలు కోసం వచ్చిన రైతులతో మాట్లాడారు. అవసరమైన ఎరువులు సక్రమంగా అందుతున్నాయా అని ప్రశ్నించగా రైతులు అందుతున్నాయని సమాధానమిచ్చారు. అక్కడి నుంచి గ్రామీణ పశు వైద్యశాలకు చేరుకున్న కలెక్టర్.. భవనాన్ని పరిశీలించారు. అవసరమైన మరమ్మతులు చేయించాలని పశువైద్యుడు గంగాప్రసాద్‌కు సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ వెంకట్రావు, మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ తదితరులున్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- పార్టీ సిద్ధాంతాలు, విధివిధానాలను కార్యకర్తలు తెలుసుకోవాలి
- దేశంలో ఎక్కడాలేనన్ని సంక్షేమ పథకాలు ఇక్కడ అమలవుతున్నాయి..
- క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాలి
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)



మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి సీతక్క. వేదికపై షబ్బీర్‌అలీ, సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి తదితరులు

నిజామాబాద్ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాలు, విధివిధానాలను కచ్చితంగా తెలుసుకుని ముందుకు వెళ్లాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్లమెంటరీ విస్తృత స్థాయి సమావేశాన్ని నిజామాబాద్ డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని ఈవీఎం గార్డెన్స్‌లో మంగళవారం నిర్వహించారు. నిజా మాబాద్, కామారెడ్డి, నిర్మల్, కోరుట్ల, జగిత్యాల, జుక్కల్‌ల నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీ లు, ఆయా కార్పొరేషన్ల చైర్మన్లు, జిల్లా బాధ్యులు, పలు విభాగాలకు చెందిన నాయకులు హాజరయ్యారు.

కార్యకర్తలనుద్దేశించి మంత్రి సీతక్క మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన వేల కోట్ల రూపాయలతో సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలుచేస్తున్నామన్నారు. కేవలం తొమ్మిదిరోజుల్లో రూ.9 వేల కోట్ల రూపాయల రైతుభరోసా ఇచ్చామన్నారు. సన్నబియ్యం ఇస్తున్న రాష్ట్రం దేశంలో కేవలం తెలంగాణ మాత్రమేనని పేర్కొన్నారు. రూ.21 వే కోట్ల రుణమాఫీ చేసిన ఘనత ప్రభుత్వానికి దక్కుతుందని, అధికారంలోకి రాగానే 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని గుర్తుచేశారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు విజయవంతంగా అమలు చేస్తున్నామని, నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరుచేశామని వివరించారు. ఇన్ని మంచి పథకాలు అమలు చేస్తున్నా.. వాటిని ప్రజలకు చేరవేయడంలో కార్యకర్తలు వెనుకబడి ఉన్నారన్నారు. ఈనెల 4న హైదరాబాద్‌లో నిర్వహించే కార్యకర్తల సదస్సుకు వేల సంఖ్యలో కార్యకర్తలు హాజరు కావాలని, ప్రతి గ్రామం నుంచి 500 మందిని తీసుకురావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, మదన్ మోహన్, డాక్టర్ సంజయ్, వెడ్మ బొజ్జు, లక్ష్మీకాంతా రావు, ఎంపీ సురేశ్ షెట్కార్, మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రావు , కార్పొరేషన్‌ల చైర్మన్‌లు ఈరవత్రి అనిల్, తాహెర్‌బిన్ హందాన్, మానాల మోహన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, నిజామాబాద్ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, నుడా చైర్మన్ కేశ వేణు, నాయకులు రాంభూపాల్, విపుల్‌గౌడ్, బాడ్సి శేఖర్ గౌడ్, కేతావత్ యాదగిరి, నరాల రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

- తెయూలో ఓ అధికారి ఇష్టారాజ్యం
- డబ్బులు దండుకునేందుకు దొంగ లెక్కలు
- సహచర సిబ్బందికి వేధింపులు

నేను వీసీ మనిషిని..



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ‘నేను వీసీ మనిషిని.. నన్ను ఆపేదెవరు..’ అంటూ తెలంగాణ యూనివర్సిటీలో ఓ అధికారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాని విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏ చిన్న అవకాశం దొరికినా లెక్కల్లో గోల్‌మాల్ చేస్తూ డబ్బులు నొక్కేస్తున్నాడని, వైస్ ఛాన్స్‌లర్ ఎదుట మాత్రం ‘ఎస్ బాస్’ అన్నట్లుగా వ్యవహరిస్తూ సహచర సిబ్బందిని మాత్రం వేధిస్తున్నాడని విద్యార్థి నాయకులు అంటున్నారు.

మే 3వ తేదీన ‘నీట్ యూజీ’ ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించగా, యూనివర్సిటీ కళాశాలతోపాటు వర్సిటీలోని మరో కళాశాలతో కలిపి రెండు పరీక్ష కేంద్రాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) కేటాయించింది. ఈ కేంద్రాల్లో దాదాపు 1,100 మంది అభ్యర్థులను కేటాయించారు. ఈ పరీక్ష కేంద్రాలకు సదరు అధికారిని, మరో కళాశాలకు అతడి సన్నిహితుడిని సూపరింటెండెంట్లుగా నియమించారు. పరీక్ష నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా స్టేషనరీ ఖర్చులు, తాగునీరు, శానిటైజేషన్, నంబర్లు వేయడం వంటి పనులకు, సంబంధిత సబ్ స్టాఫ్‌కు చెల్లించేందుకు అదనంగా పరీక్ష కేంద్రం నిర్వహణ కోసం ఒక్కో అభ్యర్థికి రూ.60 చొప్పున పరీక్ష తేదీకి వారం రోజులు ముందుగానే ఎన్‌టీఏ చెల్లించింది. రెండు పరీక్ష కేంద్రాల్లో పనిచేసిన సిబ్బందికి ఎన్‌టీఏ నిర్ణయించిన మొత్తాన్ని ఇవ్వలేదనే ఆరోపణలు వస్తున్నాయి. అయితే తాను వీసీ మనిషిని అని సదరు అధికారి చెబుతుండడంతో సిబ్బంది మిన్నకుండి పోయారని సమాచారం. ఇదిలా ఉంటే యూనివర్సిటీకి చెల్లించాల్సిన రూ.66వేలను సైతం గుట్టుచప్పుడు కాకుండా నొక్కేసినట్లు తెలుస్తోంది. పరీక్ష పూర్తయిన వెంటనే రిజిస్ట్రార్ అకౌంట్‌లో జమ చేయాల్సిన ఆ మొత్తాన్ని జేబులో వేసుకున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. అయితే 2009లో ఆచార్య లింబాగౌడ్ ప్రిన్సిపల్‌గా ఉన్నప్పటి నుంచి ఇప్పటివరకు బయటి సంస్థలు ఎలాంటి పరీక్షలు జరిగినా సెంటర్ నిర్వహణ కోసం నిర్దేశిత మొత్తాన్ని నిర్వహణ ఖర్చుల కోసం యూనివర్సిటీ అకౌంట్‌లో జమ చేసే ఆనవాయితీ పాటిస్తూ వస్తున్నారు.

విచ్చలవిడిగా అడ్వాన్సులు..

ఇటీవల జరిగిన కళాశాల వార్షికోత్సవంలోనూ నాలుగు ఫ్లడ్‌లైట్లు, సౌండ్ సిస్టమ్ ఏర్పా టు చేయించి ఏకంగా రూ.2.35 లక్షల బిల్లు క్లెయి మ్ చేయడంతోపాటు నిర్వహణ ఖర్చుల కింద మరో రూ.40 వేల బిల్లు పెట్టినట్లు విశ్వసనీయ సమాచారం. మే నెలలో మహనీయుల జయంతి పేరుతో ఆయా అధికారులకు నిర్వహణ బాధ్యతలను అప్పగించినప్పటికీ సదరు అధికారి తానే అజమాయిషీ చెలాయించాడనే విమర్శలు ఉన్నాయి. మహనీయుల జయంతి సందర్భంగా మహిళా, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సెల్‌లు ఏర్పాటు చేసే కార్యక్రమాలకు తానే వర్సిటీ నుంచి డబ్బులు తీసుకునందుకు చేసిన ప్రయత్నం బెడిసికొట్టినట్లు సమాచారం. ఇప్పటికే కీలక పదవిలో ఉన్న ఆయనకు ఇటీవల వసతిగృహాల అదనపు బాధ్యతలు అప్పగించారు. సంబంధిత విభాగంలో విచ్చలవిడిగా అడ్వాన్సులు తీసుకుంటున్నట్లు తెలిసింది. వీసీ మనిషి కావడంతో ఎవ్వరు కూడా అభ్యంతరం చెప్పలేని పరిస్థితి. ముగ్గురు బోధనేతర మహిళా సిబ్బందిని సదరు అధికారి వేధిస్తున్నట్లు సమాచారం. ఆ ముగ్గురు ఉద్యోగులు రిజిస్ట్రార్‌ను కలువగా, తానేమీ చేయలేనని, వీసీని కలవాలని సూచించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా వీసీని కలిసి ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో సదరు అధికారి మరింత విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారనే చర్చ వర్సిటీలో సాగుతోంది.

క్లుప్తంగా

పరీక్ష ఫీజు చెల్లించండి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలో బీఈడీ, బీపీఎడ్ రెండో, నాల్గో సెమిస్టర్ రెగ్యులర్ (2024–25), బ్యాక్ లాగ్ (2021 విద్యా సంవత్సరం) 1, 2, 3, 4 సెమిస్టర్ పరీక్ష ఫీజును ఈనెల 14వరకు చెల్లించాలని కంట్రోలర్ సంపత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 100 అపరాధ రుసుంతో ఈనెల 15 వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందని కంట్రోలర్ తెలిపారు. పూర్తి వివరాల కోసం తెలంగాణ వర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ విజేత రంగారెడ్డి

- రన్నర్‌గా నిజామాబాద్
- విజేతలకు ట్రోఫీ ప్రదానం చేసిన సీపీ సాయి చైతన్య



ఫుట్‌బాల్ టోర్నీ విజేత రంగారెడ్డి జట్టుతో సీపీ సాయిచైతన్య, నిర్వాహకులు

నిజామాబాద్ నాగారం/ఖలీల్‌వాడి: జిల్లాకేంద్రంలోని రాజారాం స్టేడియంలో నాలుగు రోజులుగా సాగిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోటీలు మంగళవారం ముగిశాయి. పోటీల్లో విజేతగా రంగారెడ్డి జిల్లా జట్టు నిలువగా, రన్నర్‌గా నిజామాబాద్ జట్టు నిలిచింది. ముగింపు కార్యక్రమానికి సీపీ సాయిచైతన్య ముఖ్య అతిథిగా హాజరై, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఆటలో గెలుపు ఓటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు. విన్నర్, రన్నర్ టీమ్‌లను అభినందించారు. ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు, జావిద్, కరీం, ఒలింపిక్ సంఘం ప్రతినిధులు బొబ్బిలి నర్సయ్య, కోచ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



రన్నర్ ట్రోఫీతో నిజామాబాద్ జట్టు

నత్తనడకన బదిలీలు.. నిరాశలో సెర్ప్ సిబ్బంది

- జీవో వచ్చి రెండు నెలలు దాటినా పూర్తికాని ప్రక్రియ
- ఎక్కడ ఎలక్షన్ కోడ్ వస్తుందోనని భయం



డొంకేశ్వర్(ఆర్మూర్): సెర్ప్ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. బదిలీల జీవో వచ్చి రెండు నెలలు దాటినా ప్రక్రియను పూర్తిచేయకుండా రాష్ట్ర శాఖ అధికారులు సాగదీస్తున్నారు. కేవలం ఏపీడీ, డీపీఎంల బదిలీలను నిర్వహించిన ఉన్నతాధికారులు ఏపీఎంలు, సీసీలు, ఇతర ఉద్యోగుల విషయంలో నాన్చుతున్నారు. దీంతో పక్షం రోజుల్లో పూర్తయ్యే బదిలీలకు నెలలు గడుస్తున్నాయని సిబ్బంది వాపోతున్నారు.

జిల్లాలో సుమారు 200 మంది..

గ్రామీణాభివృద్ధి శాఖలో ఐకేపీ ఉద్యోగులకు గత పదేళ్లుగా బదిలీలు లేవు. రాష్ట్ర ఉన్నతాధికారులపై ఒత్తిడి పెట్టి ఇటీవల ఏపీడీ, డీపీఎంలు బదిలీలు పూర్తి చేసుకున్నారు. మండల స్థాయిలో పని చేసే ఏపీఎంలు, సీసీలు స్థానచలనం కోసం ఆప్షన్లు పెట్టుకుని బదిలీల కోసం వేచి చూస్తున్నారు. జిల్లాలో బదిలీల కోసం వేచి చూస్తున్న ఏపీఎంలు 30మంది, సీసీలు 165 వరకు ఉండగా ఇతర సిబ్బంది 10మంది ఉన్నారు. ఈ నెలాఖరు నాటికి సెర్ప్‌లో అన్ని కేడర్ ఉద్యోగుల బదిలీలు పూర్తి కావాల్సి ఉండగా, ఉన్నతాధికారులు సాగదీయడం పట్ల ఏపీఎంలు, సీసీలు అసంతృప్తిగా ఉన్నారు. బదిలీలు ఆలస్యమైతే స్థానిక సంస్థల ఎలక్షన్ కోడ్ వచ్చే అవకాశముందని భయపడుతున్నారు. అదే జరిగితే రాకరాక వచ్చిన అవకాశం ఎక్కడ చేజారిపోతుందని వారు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాకు చేరని సీనియారిటీ లిస్టు..

ఏపీఎంలు, సీసీల బదిలీలకు సంబంధించిన ప్రక్రియ ఇంకా ముందుకు కదల్లేదు. జిల్లాలో పని చేస్తున్న వారందరి సీనియారిటీ లిస్టును రాష్ట్ర అధికారులు తెప్పించుకున్నారు. దానిని పరిశీలించి జిల్లాకు పంపాల్సి ఉంది. కానీ, సీనియారిటీ జాబితా ఇంత వరకు జిల్లాకు రాలేదు. జోనల్ స్థాయి ప్రకారమా? లేదా జిల్లా స్థాయా? ఎలా నిర్ణయించి జాబితాను పంపుతారానేది స్పష్టత లేదు. జిల్లా కలెక్టర్‌కు లిస్టు అందిన తర్వాత ఏపీఎంలు, సీసీలకు బదిలీలకు కౌన్సెలింగ్ చేపట్టనున్నారు. ఇదంతా జరిగే సరికి మరో పదిహేను రోజులు పట్టే పరిస్థితి కనిపిస్తోంది. ఎన్నికల కోడ్ రాకముందే తమ బదిలీలు కూడా పూర్తి చేయాలని వారు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

నాటి మా రాముని పల్లెనే.. నేటి మారంపల్లి

మీకు తెలుసా?



మారంపల్లి ముఖ చిత్రం

గోదావరి సమీపంలో ఉన్న మారంపల్లికి తెలుసుకోదగిన చరిత్ర ఉంది. రాముడు గంగానది వెంట పరిక్రమణ చేసినట్లు స్థల పురాణం ఉంది. ఎస్సారెస్పీలో ముంపునకు గురైన పాత కుస్తాపురం శివలింగాన్ని స్వయంగా రాముడే ఇసుకతో తయారు చేసినట్లు చరిత్ర ఉంది. రాముడు తిరిగిన నేల కావడంతో ఆయనపై ప్రేమతో 'మా రాముని పల్లె'గా నామకరణం చేశారు. కాలక్రమేనా అది మారంపల్లిగా మారింది.

- సుమారు 300 ఏళ్ల క్రితం మా రాముని పల్లెను స్థాపించుకున్నారు. మొదట ఇక్కడ 15 నుంచి 20 ఇళ్లు మాత్రమే ఉండేవి. ప్రస్తుతం 660 వరకు ఉన్నాయి. వ్యవసాయ భూములు కలుపుకొని ఊరి పూర్తి విస్తీర్ణం సుమారు 1,150 ఎకరాలు.
- ఊరిలో ఒకప్పుడు పెద్ద గడీ ఉండేది. ఈ గడీ గుండానే అప్పటి రాజులు, దొరలు పాలించేవారు. గడీ కూలిపోయి చాలా సంవత్సరాలు అవుతుంది.
- గ్రామానికి నలుదిక్కులా ఆరు చెరువులు ఉన్నాయి. వాటి పేర్లు సత్తర్‌కుంట, నాంకుంట, చించెరు, పెద్దచెరు, బందం కుంట, కమ్మరి కుంట. వీటిని ఇప్పటికీ ఇలాగే పిలుస్తున్నారు. వానాకాలంలో ఇవి పూర్తిగా నిండి ఊరు ఒక ద్వీపం మాదిరిగా కనిపిస్తుంది.
- ఊరు కళాకారులకు నిలయమని చెప్పవచ్చు. అప్పట్లో నాటకాలు వేయడంలో ప్రసిద్ధులు. నేటి తరం దానిని అంది పుచ్చుకుని ఇప్పుడు భజనలు, కీర్తనలు చేస్తున్నారు.
- 1959లో ఊరిలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు కాగా, 1966లో గ్రామానికి మొదటి సర్పంచ్‌గా కృష్టారెడ్డి పనిచేశారు.

– డొంకేశ్వర్(ఆర్మూర్)

విధుల్లో చేరిన డీపీఎంలు



డీఆర్‌డీవో సాయాగౌడ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బదిలీపై వచ్చిన డీపీఎంలు

డొంకేశ్వర్(ఆర్మూర్): ఐకేపీలో బదిలీలు పూర్తి చేసుకున్న డీపీఎంలు వారికి కేటాయించిన ప్రాంతాలకు వెళ్లి విధుల్లో చేరారు. వేరే జిల్లాల నుంచి మన జిల్లాకు వచ్చిన మోహన్‌కు మార్కెటింగ్, రాజేశ్వర్‌కు పెన్షన్, కిరణ్‌కు ఫైనాన్స్ సెక్షన్లు ఇచ్చారు. అలాగే మన జిల్లాలోనే ఉన్న డీపీఎంలు నీలిమాకు ఐబీ, రాచయ్యకు జీవనోపాధుల విభాగాలను కేటాయించారు. విధుల్లో చేరి సెక్షన్ల బాధ్యతలు చేపట్టిన డీపీఎంలు మంగళవారం డీఆర్‌డీవో సాయాగౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా డీఆర్‌డీవో డీపీఎంలకు శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, ఎలాంటి ఫిర్యాదులు రాకుండా పని చేయాలని వారికి సూచించారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డితో మాట్లాడుతున్న రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ

నిజామాబాద్‌అర్బన్: మైనారిటీల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ అన్నారు. నిజామాబాద్ నగరానికి మంగళవారం ఆయన విచ్చేయగా, వివిధ శాఖల అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డితోపాటు ఇతర జిల్లాల అధికారులతో భేటీ అయ్యారు. జిల్లాలో మైనారిటీ వర్గాల స్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అన్సారీ మాట్లాడుతూ.. మైనారిటీల కోసం ఉద్దేశించిన సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం మైనారిటీ వర్గాల నుంచి కమిషన్ చైర్మన్ వివిధ సమస్యలపై వినతులు స్వీకరించారు. నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ గురుకుల కళాశాలల్లో జూనియర్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. ఔట్ సోర్సింగ్ పద్ధతిన ఈ నియామకాలు చేస్తామన్నారు. జూనియర్ లెక్చరర్ కెమిస్ట్రీలో రెండు పోస్టులు, గణితం ఒక పోస్టు ఖాళీలు ఉన్నాయన్నారు. బీఎస్సీ బీఈడీ, ఎంఎస్సీ, బీఈడీ విద్యార్హత కలిగిన వారు అర్హులు అన్నారు. మూడు సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 3లోపు కలెక్టరేట్ కార్యాలయంలోని మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయం రూమ్ నెంబర్ 221లో సమర్పించాలన్నారు. వివరాలకు 98851 52515 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఫిజియో, స్పీచ్ థెరపిస్ట్ పోస్టులకు..

కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లాలోని భవిత కేంద్రాలలో విద్యార్థులకు థెరపి సేవలను అందించేందుకు అర్హులైన ఫిజియోథెరపిస్ట్, స్పీచ్ థెరపిస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈవో ఎస్.రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన, ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లోని విద్యాశాఖ కార్యాలయం రూమ్ నంబర్ 223లో ఈనెల 7లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

ఉచిత శిక్షణ.. ఉపకార వేతనం

- ఎన్‌ఎంఎంఎస్ కోసం విద్యార్థులకు శిక్షణ
- పదిహేను ఏళ్లుగా ఉదారంగా సేవలందిస్తున్న సొదారి సాగర్



సాగర్ అందించిన స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు

నందిపేట్: పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు తన మేధాశక్తిని పంచుతూ స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్నాడు నందిపేట్ మండలం లక్కంపల్లికి చెందిన సొదారి సాగర్. గత 15 ఏళ్లుగా 76 మంది పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పునాదులు వేశాడు. ప్రతి ఏడాది కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పేరిట ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద పిల్లలకు ఉపకార వేతనాలు అందిస్తుంది. 8వ తరగతి అర్హత సాధిస్తే ఇంటర్ వరకు నాలుగేళ్ల పాటు నెలకు రూ. వెయ్యి ఉపకార వేతనం అందిస్తుంది. ఇలా ఒక్కో విద్యార్థికి రూ. 48 వేలు ఆర్థిక సహాయం అందుతుంది. అత్యంత కీలకమైన పది, ఇంటర్ చదువులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ సాయం ఆసరా అవుతుంది. కాగా ఇందుకుగాను ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో మంచి మార్కులు సాధిస్తే ఉపకార వేతనాలకు ఎంపికవుతారు.

15 ఏళ్లుగా శిక్షణ..

ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థులు పడుతున్న కష్టాలను స్వయంగా అనుభవించిన సాగర్ వారిలో ఉత్సాహం, ఉత్తేజం నింపేందుకు వారి తల్లిదండ్రులు ప్రోత్సహించేలా వెన్నుతట్టాడు. ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు చేతనైనంత సాయం చేయాలని భావించిన సాగర్ గత 15 ఏళ్లుగా 2009 నుంచి ఉచితంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలకు విద్యార్థులకు సన్నద్ధం చేసేందుకు బోధించడం మొదలుపెట్టాడు. ఉన్నంతలో పుస్తకాలు, స్టడీ మెటీరియల్ అందించి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నాడు. కీలకమైన మేధానైపణ్యంపై దృష్టి పెట్టి శిక్షణ అందిస్తూ వారిని ముందుకు నడిపిస్తున్నాడు. ఇలా ఇప్పటి వరకు 76 మంది విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్ ప్రతిభా పరీక్షకు ఎంపికయ్యారు. వారంతా ఇప్పుడు ఐఐటీ, ఐఐఐటీల్లో చదువుతున్నారు.

పేద విద్యార్థుల కోసం..



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు హైస్కూల్, ఇంటర్ స్థాయిలో ఆర్థికపరమైన ఇబ్బందులతో అనేక మంది చదువుకు దూరమవుతున్నారు. కేంద్రం అందించే ఉపకార వేతనం అందితే వారికి ఎంతో చేయూత కలుగుతుందని భావించాను. నాకున్న ఖాళీ సమయాన్ని వారి కోసం వినియోగిస్తున్నాను.

– సొదారి సాగర్, లక్కంపల్లి, నందిపేట

భూ సేకరణ, చెల్లింపులు వేగవంతం చేయాలి

- అభివృద్ధి పనుల్లో జాప్యం జరగొద్దు
- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో చేపట్టే రోడ్ల విస్తరణ, ఇతర అభివృద్ధి పనుల్లో జాప్యం జరగొద్దని, ఇందుకోసం భూ సేకరణ ప్రక్రియ, చెల్లింపులు త్వరితగతిన జరిగేలా చూడాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. నగరంలోని ఐడీవోసీ సమావేశ హాల్‌లో మంగళవారం వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. బోధన్–బాసర్–భైంసా రోడ్డు నిర్మాణానికి సేకరించిన భూమికి సంబంధించిన చెల్లింపులు త్వరితగతిన జరిగేలా చూడాలన్నారు. అలాగే ఇతర అభివృద్ధి పనుల కోసం భూసేకరణ ప్రక్రియకు సంబంధించి రైతులతో సంప్రదింపులు జరుపుతూ, నష్టపరిహారం నిర్ణయంలో సానుకూల ధోరణిని అవలంభించాలని సూచించారు. నిబంధనలకు అనుగుణంగా వ్యవహరిస్తూ, భూసేకరణపై పెండింగ్‌లో ఉన్న అప్పీల్‌లను వేగంగా పరిష్కరించాలని అన్నారు. వారం అనంతరం భూసేకరణపై మళ్లీ సమీక్ష చేస్తామని, స్పష్టమైన ప్రగతి కనిపించాలని సూచించారు. అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, నిజామాబాద్, ఆర్మూర్ ఆర్డీవోలు రాజేంద్ర కుమార్, రాజాగౌడ్, ఎస్సారెస్పీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేందర్, కలెక్టరేట్ పర్యవేక్షకుడు భాస్కర్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఒకరి ఆత్మహత్య



రాములు మృతదేహం

వర్ని: మోస్రా మండలం చింతకుంట గ్రామంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ నాంపల్లి రాములు(53) మంగళవారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు వర్ని ఎస్‌ఐ మహేష్ వెల్లడించారు. రాములు మృతికి గల కారణాలు తెలియరాలేదని అతడి తల్లి పోశవ్వ ఫిర్యాదులో పేర్కొంది. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



ఖలీల్‌వాడి: నగరంలోని పులాంగ్ వాగు వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి, వివరాలు సేకరించారు. మృతుడు చిత్తు కాగితాలు ఏరుకునే వ్యక్తిగా కనిపిస్తున్నట్లు తెలిపారు. గత కొద్దిరోజులుగా ఇక్కడే చుట్టుపక్కల తిరుగుతూ రోడ్డుపై పడుకుంటున్నట్లు పేర్కొన్నారు. మృతుడి వయస్సు సుమారు 55 నుంచి 60 ఏళ్ల మధ్య ఉండొచ్చని భావిస్తున్నారు. అతడు బ్రౌన్ కలర్ నైట్ ప్యాంట్ ధరించాడని, ఎవరికైనా తెలిసినట్లయితే పోలీస్ స్టేషన్‌లో గాని, 8712659840, 8712659719ను సంప్రదించాలని సూచించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కామారెడ్డి క్రైం: కామారెడ్డి రైల్వే స్టేషన్ మూడో ప్లాట్‌ఫాం పక్కనే ఉన్న ఓ గుంతలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికులు మంగళవారం మృతదేహాన్ని గుర్తించి, పోలీసులకు సమాచారం అందించగా, పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. అతడి వయస్సు 30–40 ఏళ్ల మధ్య ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు నలుపు, తెలుపు రంగుల పూల షర్టును ధరించాడన్నారు. మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి ఆనవాళ్లు తెలిసిన వారు పట్టణ పోలీసులను సంప్రదించాలని ఎస్‌హెచ్‌వో నరహరి కోరారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో పలువురికి జైలు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధుల్లో ఇటీవల డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా, 17మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డట్లు ఏసీపీ రాజావెంకట్ రెడ్డి తెలిపారు. వారికి మంగళవారం సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించి, జిల్లా కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. మేజిస్ట్రేట్ నూర్జహాన్ బేగం వారిలో ఆరుగురికి జరిమానా వేయగా, ఆరుగురికి ఒక రోజు, ఐదుగురికి రెండు రోజుల జైలు శిక్ష విధించారు.

నవీపేట: నవీపేట శివారులో పోలీసులు ఇటీవల డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా ఓ వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. పోలీసులు అతడిపై కేసు నమోదు చేసి, మంగళవారం నిజామాబాద్ కోర్టులో హాజరుపర్చారు. జడ్జి అతడికి 7రోజుల జైలుశిక్ష విధించారు.

మోత్కూర్ పోలీసుల అదుపులో జిల్లా వృద్ధుడు



దండు గోవర్ధన్

ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లాకు చెందిన వృద్ధుడు యాద్రాది జిల్లా మోత్కూర్ పోలీసుల అదుపులో ఉన్నట్లు నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. నిజామాబాద్‌కు చెందిన దండు గోవర్ధన్(60) అనే వృద్ధుడు మోత్కూర్‌లో సంచరిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన వ్యక్తి కావడంతో ఇక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఇతని వివరాలు తెలిసినవారు మోత్కూర్ పీఎస్ 70970 52763 లేదా నాలుగో టౌన్ పోలీసులు 87126 59840, 8712659719ను సంప్రదించాలన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కేసులు

- విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి
- సీపీ సాయిచైతన్య

ఖలీల్‌వాడి: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కేసులు నమోదు చేస్తామని పోలీస్ కమిషనర్ సాయిచైతన్య ఒక ప్రకటనలో వెల్లడించారు. అలాగే ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా విగ్రహాలను ప్రతిష్ఠించరాదన్నారు. విగ్రహాల ఏర్పాటుకు కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. ఊరేగింపులు, బహిరంగ సభల్లో పరిమితులకు మించిన ధ్వని శబ్దం ఉత్పత్తి చేసే డీజేలు, సౌండ్ సిస్టంలు నిషేధించినట్లు తెలిపారు. ఎవరైనా లౌడ్‌స్పీకర్లు పెట్టాలని భావిస్తే సంబంధిత అధికారుల నుంచి ముందస్తుగా అనుమతి తీసుకోవాలన్నారు. సమావేశాలు, సభలు నిర్వహించాలని భావిస్తే సంబంధిత ఏసీపీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. 500 మంది కంటే ఎక్కువ జనాభ ఉండే కార్యక్రమనికి 72 గంటల ముందుగా సీపీ అనుమతి తీసుకోవాలన్నారు. డ్రోన్ల వాడకంపై ప్రభుత్వ సంస్థలు, పోలీసు, ఏవియేషన్ అధికారుల నుంచి క్లియరెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. జిల్లాలో గల్ఫ్ ఏజెంట్లకు తమ ఇల్లు అద్దెకు ఇచ్చే ముందు జాగ్రత్తగా వ్యవహరించాలని ప్రజలకు తెలిపారు. ఎవరైనా అనుమానస్పదంగా కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ ఉత్తర్వులు ఈ నెల 1 నుంచి 15వరకు అమలులో ఉంటుందన్నారు. జిల్లా ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు.

సంఘ సభ్యుడి మృతి: ఆర్థికసాయం అందజేత



లక్ష్మణ్ భార్యకు నగదు అందజేస్తున్న బహ్రెయిన్ సంఘ సభ్యులు

డిచ్‌పల్లి: తమ సంఘంలోని సభ్యుడు మృతిచెందగా, బాధిత కుటుంబానికి ఆర్థికంగా చేయూతనందించడానికి రూ.3.10లక్షల నగదును అందించింది బహ్రెయిన్ సంఘం. మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి గ్రామానికి చెందిన పట్నం చిన్న లక్ష్మణ్ గతంలో బతుకుదెరువు కోసం బహ్రెయిన్ దేశానికి వెళ్లాడు. అక్కడ గ్రామానికి చెందిన వలస కార్మికులతో కలిసి బహ్రెయిన్ సంఘం ఏర్పాటు చేసుకున్నారు. ప్రతి నెలా డబ్బు జమ చేస్తూ, సంఘ సభ్యుల్లో అవసరమైన వారికి ఇచ్చేవారు. సంఘ సభ్యుడిగా ఉన్న లక్ష్మణ్ కరోనా సమయంలో స్వగ్రామానికి వచ్చి, లాక్‌డౌన్ వల్ల తిరిగి వెళ్లలేకపోయాడు. ఈక్రమంలో అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో అతడి కుటుంబాన్ని ఆదుకోవడానికి సంఘం సభ్యులందరు జమ చేసిన రూ.3.10 లక్షల నగదు మంగళవారం లక్ష్మణ్ భార్య విజయకు అందించారు.

వ్యవసాయంలో 'డ్రోన్' సాయం



డ్రోన్ పంపుతో పంట భూమిలో మందు పిచికారి చేస్తున్న ఆపరేటర్

బాల్కొండ: వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు రావడంతో అంతా యాంత్రికమైంది. అందులో భాగంగా పంటల్లో గడ్డి మందు, పురుగు మందు పిచికారి కోసం డ్రోన్ పంపులను వినియోగిస్తున్నారు. డ్రోన్ పంపు ధర రూ. 5 లక్షల వరకు ఉంటుంది. పది నిమిషాల వ్యవధిలో ఎకరం పంటలో మందును పిచికారి చేస్తుంది. వ్యవసాయంలో డ్రోన్ సాయంతో మందుల పిచికారి ఎంతో సాంపుగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. ఎకరానికి రూ. 500 తీసుకుని పంపు స్ప్రే చేస్తున్నారు. మందు కూడా పూర్తి స్థాయిలో వినియోగం జరుగుతుందని అంటున్నారు. డ్రోన్ ద్వారా స్ప్రే చేయడం వల్ల శ్రమ తగ్గడంతో పాటు ధర కూడ తక్కువే అవుతుందని రైతులు పేర్కొంటున్నారు.

డబుల్ ఇంజిన్ సర్కార్‌తో లాభం లేదు



సమావేశంలో మాట్లాడుతున్న షబ్బీర్ అలీ, బల్మూరి వెంకట్, సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ
- నగరంలో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్లమెంటరీ విస్తృత స్థాయి సమావేశం



మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి, సురేష్ షెట్కార్

నిజామాబాద్ సిటీ: ఇటీవల జిల్లాకు వచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తుందని మాట్లాడుతున్నారని, డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ఏమీ లాభం లేదని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. నగరంలో మంగళవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్లమెంటరీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎలాంటి అభివృద్ధి లేదన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు డబుల్ ఇంజిన్ సర్కార్ ఉన్న రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. రేషన్ దుకాణాల్లో మోదీ బొమ్మ పెట్టాలనడం అర్థరహితమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నా, వాటిని క్షేత్రస్థాయిలో ప్రచారం చేయడంలో మాత్రం వెనుకబడి ఉన్నామన్నారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలన్నారు. విభేదాలు పక్కనపెట్టి అంతా కలిసిమెలిసి పనిచేయాలన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. పాత, కొత్త తేడా లేకుండా కార్యర్తలు, నాయకులు కలిసిమెలిసి పనిచేయాలన్నారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి అమలుచేస్తున్న పథకాలు చూసి బీఆర్‌ఎస్ నాయకులు అసూయపడుతున్నారన్నారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. పసుపు బోర్డుతో కాకుండా, మద్దతు ధర లభించినప్పుడే పసుపు రైతుల కళ్లల్లో ఆనందం వస్తుందన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ తదితరులు మాట్లాడారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు ఘన స్వాగతం



సీతక్కకు స్వాగతం పలుకుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, డెలిగేట్ శేఖర్ గౌడ్

మోపాల్: నగరంలో నిర్వహించిన నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గస్థాయి సమావేశానికి హాజరైన జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు మంగళవారం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, పీసీసీ డెలిగేట్, నిర్మల్ జిల్లా పరిశీలకులు బాడ్సి శేఖర్‌గౌడ్ ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆమెను శాలువాతో సన్మానించారు.